# పెళ్లికి పెద్దలు

**అ**మ్మాయికి సంబంధాలు చూడటంలో కొంత తాత్సారం జరిగిన మాట నిజమే. కాని అందుకు ఏ ఒకర్నీ తప్పుపట్టటానికి వీల్లేదు - పడితే అందర్నీ పట్టాలి. తప్పు అందరిదీ అనుకునేకన్న ఏ ఒకరిదీ కాదనుకోవటమే మంచిది.

జీవితం కాళ్ళజెర్రిలాటిది. వెయ్యికాళ్ళతో నడుస్తుంది. అయితే తేడా ఏమంటే, కాళ్ళజెర్రికి చరచరా నడిచిపోవటం తెలుసు! జీవితానికి తెలీదు. ఒక కాలు వెయ్యవలసినప్పుడు ఇంకో కాలు వేస్తుంది. ఒక కాలు ఒక పక్కకి పడితే ఇంకో కాలు ఇంకో పక్కకి పడుతుంది. ఒక కాలికి మరోకాలు కొట్టుకుని జీవితం బోల్తాపడటం కూడా కద్దు. అందరికీ అనుభవంలో వుండే సంగతే గనక దీన్ని అట్టే సాగదీయనవసరం లేదు. ఒక్క ముక్కలో చెప్పాలంటే, జీవితం కంటే, తప్పటడుగులు వేస్తూ మధ్య మధ్య చతికిలబడే పాపాయి నయం - ఆ పాపాయి తన తప్పులు సరిదిద్దుకుంటూ, ఇవాళ కాకపోతే రేపైనా నడుస్తాడు. గెంతుతాడు. పరిగెత్తుతాడు కూడానూ. జీవితం చూడబోతే రామాయణ కాలంనుంచీ ఇదే విధంగా అఘోరిస్తున్నది.

అమ్మాయి పెళ్ళి గురించి సహజంగా అందరికన్నా అధికంగా ఆరాటపడిన వాళ్లు, అమ్మా, నాన్నా. అయితే వాళ్ళ ఆరాటాలకు శ్రుతికలవలేదు. అసలే దంపతులు - అందులోనూ ముప్ఫై ఏళ్ళుగా దాంపత్యం వెలగబెట్టినవాళ్ళు. అలాంటి దీర్ఘ దాంపత్యంలో ఏదో ఒకటి జరగాలి. ఒకరి మనస్తత్వం ఇంకొకరికి అనుకూలంగా మారనైనా మారాలి! లేదా, ఒకరికి ఇంకొకరు విరుద్ధంగా నైనా తయారు కావాలి. మూడో మార్గం లేదు.

అమ్మా, నాన్నా రెండో మార్గం అవలంబించారు. ఎవరో ఒకరు అవలంబించకపోతే ఆ మార్గం దేనికి వున్నట్టూ?

కాపరం పెట్టిన కొత్తలో వారి మధ్య ఇంత వ్యత్యాసం లేదు. ఒకరు ఈశాన్యంగా వుంటే మరొకరు ఆగ్నేయంగా వుండేవారనుకోవచ్చు. కాని కాలం గడిచిన కొద్దీ వాళ్ళు బొత్తిగా ఉత్తర - దక్షిణా లయిపోయారు. ఇట్లా కావటానికి అవసరమైన ప్రక్రియలు తామే సృష్టించుకున్నారు. ఒకరికి యే మాటంటే వులుకో అదే మాటను రెండోవాళ్ళు పనిపెట్టుకుని అనటం; ఒకరు యే విషయం గురించయినా రాద్ధాంతం చేసే ధోరణిలో

పడగానే రెండోవాళ్లు చప్పరించి, ఊc ఈ భాగ్యానికేనా? అన్నట్టు మాట్లాడటం; గ్రహచారం సరిగా వుండి అవతల మనిషి తనతో యేకీభవించేసరికల్లా ప్లేటు మార్చేసి యింకో ధోరణి అవలంబించటం – ఇటువంటి విద్యలు దంపతులకు కరతలామలకమ్మైనై.

అందుచేత – అమ్మ, 'ఏఁవండీ, అమ్మాయి పెళ్ళి –' అని అంటుండగానే నాన్న, 'అమ్మాయి పెళ్ళి – అమ్మాయి పెళ్ళి అని నన్ను తరుముతావేమిటి? అంత యావగలదానవు నువ్వేం చేస్తున్నట్టూ' అని కస్సుమనేవాడు.

'ఆడకుంకను. నా వల్ల యేమవుతుందీ?' అంటూ అమ్మ మగవాళ్ళమీద ఒక విసురు విసిరేది.

"నీకు సంబంధాలు వెతకడం చాతకాదుకాని, నా చేత వెతికింపజెయ్యటం చాతనవునంటావు. అంతేనా?" అనేవాడు నాన్న.

అమ్మ రెచ్చిపోయేది.

"చాల్లెండి. ప్రెద్దానికీ పెడర్థాలు తీస్తూనూ.... అయ్యో, కన్నకూతురి మెడని ఆ మూడు ముళ్ళూ యెలా పడతయ్యా అని నేను యిదైపోతూంటే. మిమ్మల్నేవో హింస జేయిస్తున్నానని గించుకుంటారేమిటీ? ఏమిటా హింసజెయ్యటం?" అని అరిచేది.

"ఓష్, నువుగా యింతేసి ఆడపిల్లనుకన్నావ్. నువు చెయ్యి వీలుజూసుకుని 7–15కి అమ్మాయి పెళ్ళి గురించి ఆరాటం తెచ్చుకుంటే, నేను కూడా నీతో బాటు ఎగరొప్పాలి? లేకపోతే నాకు నీకున్నపాటి ఆరాటం లేనట్టా? నాకుతెలీకుండా యెక్కడ సంపాదించావీ తెలివితేటలు?" అనేవాడు నాన్న.

ఈ వాగ్యుద్ధం ఒక్కోసారి గంటలకొద్దీ సాగేది. ఎవరిమటుకువాళ్ళు, యీ దెబ్బతో నోరు మూతపడాల్సిందే అనుకున్నట్టుగా మాట విసిరేవాళ్ళు. కాని రెండో మనిషి ఆ దెబ్బ తప్పుకుని మరో మహాస్త్రం ప్రయోగించటమో, లేక తన మీదికి వచ్చిన అస్త్రాన్నే తిప్పి కొట్టటమో తటస్థించేది. అంతా మహాభారతం లోని యుద్ధపర్వంలాగా వుండేది వినేవాళ్ళకు.

ఇద్దరూ అతిరథులే. ఎవరూ ఓడేవాళ్ళుకారు. గెలిచేవాళ్ళూ కారు. కాకపోతే తమ అస్త్రాలు విఫలమైపోతున్న కొద్దీ యిద్దరికీ రోషావేశాలు రెచ్చిపొయ్యేవి. శేషం కోపేన పూరయేత్ – అనుకుంటూ వాగ్యుద్ధం సాగించేవాళ్ళు.

ఈ వాగ్యుద్ధాలను అమ్మాయి యిప్పటికి నాలుగేళ్ళనుంచీ వింటున్నది. అమ్మా నాన్నా సాగించే యీ పోరాటం నిజంగా తన పెళ్ళి కావాలన్న వుద్దేశం తోనేనని దానికి యెన్నడూ, పొరపాటున కూడా, అనిపించలేదు. వాళ్ల దాంపత్య ధర్మంలో

కొట్లాడుకుంటున్నారు - అంతే, తన పెళ్ళి కేవలం ఒక సాకు. కావలిస్తే వాళ్ళు వంటను గురించీ, సినిమా కెళ్ళటం గురించీ, నగలు కొనటంగురించీ, ఇదే ఉత్సాహంతో కొట్లాడగలరు - లక్షసార్లు కాట్లాడారు కూడా.

నాన్న ఏదో కొత్త తలనూనె తీసుకురాగానే, "కాస్త డబ్బు చూసి మరీ వాడుదురూ, అడ్డమైనవన్నీ కొనకా -" అనేది. ఈ అవకాశం తీసుకొని, నాన్న లోగడ చేసిన దుర్వ్యయమంతా చిట్టా వప్పగించేసేది.

దాంతో నాన్న అగ్గిరాముడైపోయేవాడు. కప్పు లేచిపోయేది.

ఆ తరవాత ఇంకోరోజు అమ్మ, "అమ్మాయికి నా కమ్మలిచ్చేసి నేను కొత్తవి చేయించుకుంటా. సమ్మంధాలు రావలసినపిల్ల! దానికా ఒంటిరాతి కమ్మలేవిటీ, దాని రాత కాకపోతే. అయ్యే ఖర్చేదో అవుతూనే వుంది! కావలసింది ఒక్కటీ అంవరదు" అంటూ ఆ కమ్మలచుట్టూ ఒక పెద్దగూడు మహ ఒడుపుగా అల్లేది.

దాన్ని నాన్న ఇట్టే చించి చెండాడేవాడు. "దుబారా ఖర్చు గురించి నువు నాకు నీతులు చెప్పి మూడురోజులు కాలేదే" అంటూ శాంతంగానే ప్రారంభించేవాడు. కాని త్వరలోనే చర్చ అరుపులలోకీ, శాపనార్థాలలోకీ వెళ్ళిపోయేది.

ఈ చర్చించటంలో ఇద్దరూ కూడా ఒక పొరపాటు చేసేవాళ్ళు. అవతలి మనిషి శాంతచిత్తంతో తాను చెప్పింది వింటున్నట్టూ తన మాటలలో ఉండే పరమ సత్యాన్ని తలకు పట్టించేసుకుని అభిప్రాయాలు మార్చేసుకునేట్టూ భ్రమపడి మాట్లాడేవాళ్ళు.

"నేను డబ్బు ఖర్చుమాట ఎత్తడమే లేదు. నీ లెక్కన నేను వెనకా ముందూ చూడకుండా డబ్బు తగలేసేవాణ్ణేగా. నేననేదల్లా ఏంవిటంటే.... నన్ను నువు నగలు చేయించమని ఏ మొహం పెట్టుకుని అడుగుతావూ అని.... అవును, అమ్మాయి చెవులు బోసిగానే వున్నై. నీ కమ్మలు దానికి పెట్టి, దాని కమ్మలు నువు పెట్టుకో, సమ్మంధాలు వచ్చేవి నీక్కాదుగా?" అన్నాడు నాన్న.

"అబ్బో, మీ దుబారా అంతా మీక్కావలసినప్పుడే; నాకోసం కానీ ఖర్చు పెడతారూ? నాకు తెలుసులెండి. ఏం? నగలు చేయించుకోవటం దుబారా ఖర్చా? ఇంత పట్నం వుంది, ఏ మగాణ్ణయినా అడగండి - నగలు తింటామా? ఎప్పుడమ్ముకున్నా డబ్బేగా? బంగారం ధర పాపంలాగా పెరిగిపోతున్నదాయెమరి. ఇది యింతలో తగ్గదని వాళ్ళ నారాయణమూర్తి కూడా చెబుతున్నాడు. నా కమ్మలు దానికెందుకు పెట్టాలి? నేను పెట్టను. మీ కూతురేగా? ఇష్టమైతే చేయించుకోండి- కష్టమైతే మానుకోండి. ఓహో" అన్నది అమ్మ.

"ఈ భాగ్యానికేనా కూతురిమీద కొండంత అపేక్ష వున్నట్టు మాట్లాడావు? నేను కావాలనుకున్నప్పుడు దానికి కమ్మలు కొంటాలే. నువు మాట్లాడక వూరుకో" అన్నాడు నాన్న.

"అడిగితేనే యింత అఘాయిత్యం మాటలంటున్నారు. అడక్కుండా కమ్మలు కొంటార్త – నే జూడనూ" అన్నది అమ్మ.

ఇటువంటి వాగ్వాదాలు జరిగేటప్పుడు ఆఖరు మాట తనది కావాలని అమ్మా, నాన్నా కూడా విశ్వప్రయత్నం చేసేవాళ్ళు. అసలు విషయం అయిపోయాక కొసరు విషయాలు తీసుకొచ్చి, చాకిరేవు పెట్టేవాళ్ళు. ఆ చాకిరేవు యెంతకీ తెమిలేదికాదు.

అమ్మా, నాన్నా వాగ్వాదం ప్రారంభించగానే అమ్మాయి చిన్న గొంతుతో, "మళ్ళీ చాకిరేవు పెట్టారూ?" అనేది.

"చాకిరేవు కాదే – రావణాసురుడి కాష్టం. అది యెన్నటికీ చల్లారదు" అనేవాడు అన్నయ్య కొంచెం గట్టిగానే. ఐతే తమ పిల్లలు తమ గురించి యేమనుకుంటున్నారన్నది అమ్మకూ, నాన్నకూ పట్టేదికాదు.

కన్నకూతురి పెళ్ళి విషయం గదా అని అయినా ఆ పుణ్యదంపతులు తమ పద్ధతి కాస్త మార్చుకోలేదు. నాన్నకు పురుషాహంకారం తన్నుకొచ్చినప్పుడు అమ్మకు ఎక్కడలేని వేదాంతమూ పుట్టుకొచ్చేది.

"ఏఁవిటో మీ వెఱ్రిగాని, మనచేతిలో ఏమీలేదు. ఎంతమందిని చూస్తున్నాం కాం? ఆ శారదాంబా వాళ్ళు ఆ కూతురికోసం నా తలవెంట్రుకలన్ని సంబంధాలు చూశారు. చివరికి, వద్దంటే వద్దనుకున్న మేనరికమే జరిగింది. వరహీనం కూడానూ. పిల్లకన్న అతను రెండురోజులే పెద్దట. పైకి ఆ మాటలంటున్నారేగాని, రెండు రోజులు చిన్నేమోకూడాను" అనేది అమ్మ.

అమ్మకు ఆదుర్దా తన్నుకొచ్చినప్పుడు నాన్న సరిగ్గా యిదే విధంగా మాట్లాడేవాడు. "ఆ సాకేతరామయ్య తన కూతురికి సంబంధాల కోసం కాళ్ళకి బలపాలు కట్టుకు తిరిగాడు. చివరికి యెటువంటి సంబంధం తెచ్చాడో చూడు – గీత అంటా గీత" అనేవాడు నాన్న.

మొదటి రెండేళ్ళూ అమ్మాయి పెళ్ళికోసం అమ్మా, నాన్నా పడ్డ హైరాన యే విధంగానూ పెళ్ళి ప్రయత్నం అనిపించుకోదు. సంబంధాలు చూడాలి. ఎవరూ పట్టించుకోవటంలేదు. అందుకే యింతవరకూ ఒక్క సంబంధమైనా చూడటం జరగలేదు. ఇదీ వారి ధోరణి.

ఆ తరువాత నాన్న కుండ పగలేసి అసలు విషయానికి వచ్చాడు.

"పడు పడు అన్న నాసవితేగాని పడ్డ నాసవితి లేదుట. సంబంధాలు చూడు చూడు అంటే అయిపోయిందా? ఎప్పుడు చూడటం? ఎక్కడని చూడటం? ఆఫీసులో పని, ఇంట్లోపని, క్షణం తీరికలేదు. దూడగుంజలనుంచి బఱ్ఱెగుంజ కన్నట్టు – ఆఫీసుకూ, ఇంటికీ మధ్య తిరగటంతోనే కాలం గడిచిపోతూండె. ఈ దిక్కుమాలిన సంబంధాలు చూడబోతే బస్సుల్లో తగిలేవి కావాయె" అన్నాడాయన.

"మిగిలినవాళ్ళంతా పిల్లలకి పెళ్ళిళ్ళు చెయ్యటం లేదుటండీ?" అన్నదామె. సమయోచితంగా ఆవిడకు ఒకసారి ప్రపంచం నిండా పెళ్ళిళ్ళు చేయించి పారేసే వాళ్ళు కనిపించేవాళ్ళు. మరోసారి ఎక్కడ చూసినా, పిల్లలకి మొగుళ్ళను వెతకలేక అఘోరించేవాళ్ళే కనిపించేవాళ్ళు. ఆవిడ జీవిత సత్యాలతో ఆ విధంగా ఆడుకునేది.

"పదిమంది మనుషులు వెయ్యేసి కళ్ళతో చూస్తూంటే తప్ప ఆడపిల్లకి సమ్మంధం కుదరదు. అందుకని ఎంతమందికో చెప్పి ఉంచా. వాళ్ళు మాత్రం ఏం చేస్తారూ?" అన్నాడు నాన్న.

నాన్న చేసింది వొఠ్ఠి తెలివితక్కువపని అని అమ్మకు ఇట్టే తెలిసిపోయింది.

"ఏమీ చెయ్యకుండా ఉన్నా మా బాగే. అడిగిందే చాలుగదా అని ఏ దిక్కుమాలిన సమ్మంధమో వచ్చి మన మెడకి చుట్టేస్తారు..." అన్నది అమ్మ.

"వాళ్ళు సమ్మంధం చూసేవాళ్ళేగాని చేసేవాళ్ళు కాదుగా?" అన్నాడు నాన్న.

"అయినా వాళ్ళకు మన పిల్ల పెళ్ళే పట్టిందా ఏఁవిటి?" అన్నది అమ్మ ప్లేటు మార్చేస్తూ.

"క్షణం కిందట పనికిమాలిన సమ్మంధం తెస్తారన్నావు. ఇప్పుడు సమ్మంధమే చూడరంటున్నావు. ఏదో ఒకటి తేల్చుకో...." అన్నాడు నాన్న చిరాకుపడుతూ.

"ఏదీ? ఒకళ్ళయినా, ఇదుగో సమ్మంధం అన్న పాపాన పోయారా?" అని అమ్మ నిలవదీసి అడిగింది.

చర్చ హనుమంతుడి తోకలాగ పెరిగిపోయింది. మధ్య మధ్య కార్యాసక్తి.

సమ్మంధాలు కావలసినవాళ్ళు పత్రికల్లో ప్రకటనలు వేస్తున్నారు. ఆ పని చేస్తే?

ఎందుకు? డబ్బు దండగ, పత్రికల్లో ప్రకటనలకు సమాధానాలు రాస్తే పోలా? అందుకని రోజూ శ్రద్ధగా పెళ్ళి ప్రకటనలు చూసి, ఆశాజనకంగా కనిపించినవారికి సమాధానాలు రాశారు. ఇద్దరు యువకులవద్దనుంచి ఉత్తరాలు కూడా వచ్చినై. కాని వాళ్ళ షరతులు అందుబాటులో లేవు... ఒకడు తనకు వుద్యోగం చూసి పెడితేగాని పెళ్ళాడనన్నాడు.

ఒకనాడు దేవుడల్లే సీతప్పమావయ్యొచ్చాడు.

"ఏం బావా? పిల్ల పెళ్ళికి సంబంధాలు చూస్తున్నావుట గదూ? ఏదైనా ఒనగూడేలా వుందా?" అని అడిగాడు నాన్నని.

"ఆకాశాన యెక్కడా ఓ యింత మబ్బుతునకలైనా లేవనుకో...." అన్నాడు నాన్న.

"సతమతమై ఛస్తున్నామన్నయ్యా! నువు కాసింత సాయం చేద్దూ...." అన్నది అమ్మ.

"నీ కెందుకే బెంగా, వెర్రిదానా? కో అంటే కోటి సంబంధాలు ! ఏమనుకున్నావోను. అంతా డబ్బులో వుందనుకో. ఓ పదివేలు పారెయ్! కొండమీది కోతి దిగొస్తుంది...." అన్నాడు మావయ్య.

"పదివేలే? నీకేవన్నా మతిపోయిందా యేవిటి?" అన్నాడు నాన్న.

"కష్టమేమరి, ఐతేనేం? ఒక్కగానొక్క కూతురూ. పళ్ళ బిగువుని ఆ కట్నం అలా గిరవాటేశావంటే. నీ బరువు శాశ్వతంగా దిగిపోయినట్టే. ఆ తరవాత ఎంత హాయి, ఎంత తెరిపి...." అన్నాడు మావయ్య.

"అఘోరించినట్టే వుంది... పళ్ళు బిగిస్తేనే పదివేలు రాలేట్టుంటే అబ్బాయిని ఇంజనీరు చదివించకపోయానూ?" అన్నాడు నాన్న.

మావయ్యకు యేదో తట్టింది.

"అన్నట్టు, వొరే, మా కోడలి పింతాతగారు నలుగురు కూతుళ్ళకు ఎంత గమ్మత్తుగా పెళ్ళి చేశాడనుకున్నావ్? ఆయన భార్య ఆయనతో ఓనాడు, ఏఁవండీ? పెద్దదాని పెళ్ళి చేయొద్దూ? అన్నదిట. ఆయన వెంటనే కండువా మీద వేసుకుని యెకా యెకీ స్కూలుకు వెళ్ళి, హెడ్మాష్టరుగారి దర్శనం చేసుకుని, అయ్యా పెద్ద తరగతులు చదివే వాళ్ళలో పేద కుర్రాళ్ళు కాస్త చురుకైన వాళ్ళు,ఎవరున్నారో కాస్త చెబుతారా? అన్నాట్ట. హెడ్మాష్టరుగారు ఇద్దరు ముగ్గురు స్కాలర్షిప్పు కుర్రాళ్ళను చూశారట. వాళ్ళలో తన పెద్దకూతురికి యీడూ జోడూ అయినవాణ్ణిగా చూసి, వివరాలు తెలుసుకుని, వాడితరఫు పెద్దవాళ్ళతో మాట్లాడి, ముహూర్తం పెట్టి, నెల తిరక్కుండా పెళ్ళిచేశాట్ట. మిగిలిన ముగ్గురాడపిల్లలకీ ఇదే మోస్తరుగా పెళ్ళిళ్ళు చేశాడనుకో. నాలుగు సంసారాలూ నిక్షేపంలా వున్నాయి. నేననేదీ.... తంపర పెంచుకున్న కొద్దీ పెరుగుతుంది. తుంచేశావో, ఏ గొడవా వుండదు" అన్నాడు మాఁవయ్య.

నాన్న తల అడ్డంగా తిప్పి, "ఆ రోజులు వేరు. ఈనాడు నా పిల్లను తీసికెళ్ళి ఏ బీద విద్యార్థికో ఇచ్చానో, వాడు నా యింటనే తిష్ట వేస్తాడు. వాళ్ళకు నాలుగు కాయలు కూడా కాస్తే ఇక నా సంగతి అడిగావ్?" అన్నాడు.

మాఁవయ్య  మాటమార్చి, "అన్నట్టు పిల్లలిద్దరూ ఏరీ? కనపడ్రే?"అంటూ కలయచూశాడు.

"వాళ్ళా? ఏదో ఎక్స్‌కర్షనట - తిరపతి వెళ్ళారు" అన్నాడు నాన్న.

"పిల్లను కూడా పంపారా?" అన్నాడు మాఁవయ్య ఘోరం జరిగిపోయినట్టుగా.

"నేను వద్దనే అన్నా, ఒక్కరోజేగదా, వెళ్ళనిమ్మన్నది మీ చెల్లెలు. ఓ వేళ నేను వెళ్ళమని వుంటే చక్రం అడ్డేసి దాన్ని ఆపివుండేదేమో..." అన్నాడు నాన్న, అమ్మమీద ఒక విసురు విసురుతూ.

"మన సౌలభ్యం అన్నయ్యకు తెలుసులెండి. నువ్వు మాత్రం పిల్ల సంగతి మనసులో ఒక పక్క పెట్టుకోవాలన్నయ్యా. మేం మందీ మార్బలం కలవాళ్ళం కాంగద..." అన్నది అమ్మ.

"నువ్వింతగా చెప్పాలా? ఇహ ఆ పనిమీదే వుంటాననుకో..." అని మాంవయ్య గొడుగు చేతబుచ్చుకుంటూండగానే పిల్లలు తిరపతి నుంచి తిరిగి వచ్చారు. వాళ్ళ వెంట యింకో అబ్బాయి కూడా వున్నాడు. అమ్మాయి కొత్త పట్టు చీరెకట్టి పెళ్ళికూతురల్లే వెలిగిపోతున్నది.

"ఈ చీరె యెక్కడిదే?" అన్నది అమ్మ.

"ఈ అబ్బాయెవర్రా?" అన్నాడు నాన్న.

"పెళ్ళికొడుకు. నిన్న తిరపతిలో అమ్మాయికీ, ఇతనికీ పెళ్ళి జరిగింది" అన్నాడన్నయ్య. ఒక్కసారిగా ప్రొజెక్టరులో ఫిలిం ఆగిపోయినట్టయింది. సౌండు లేదు, బొమ్మ కదలదు. ఎక్కడి వాళ్ళక్కడ కొయ్యబారిపోయారు. తరవాత ఫిలిం రెట్టింపు వేగంతో పరిగెత్తినట్టయింది! నెత్తులు బాదుకోవటం, కేకలు, గందర గోళం, బీభత్సం - నాన్న అరిచాడు. అమ్మ యేడ్చింది. మామయ్య తత్తరబిత్తరగా చింపాంజీ భాషలో యేవిటో అంటున్నాడు. అది యెవరికీ అర్థం కావటంలేదు. కొంత సేపయాక వేడీ, ఉద్రేకాలూ, ఉచ్చైశ్రవాలూ కాస్త ఉపశమించి అందరూ మామూలు మనుషుల ధోరణిలోకి రాసాగారు.

మావయ్య వేదాంతం చెప్పాడు. "ఇలా రాసిపెట్టి వుంది గావును. ఆపటం నీ తరమా?... మాటలా?.... అబ్బో ఇంతకన్న యెంతో యిదిగా జరిగిన విషయాలున్నాయి. ఏవిటో ఇంతకీ శుభమేగదా జరిగింది? బరువు దిగిపోయింది. ఇక నేవిటి?"

కాస్త తాపీగా విచారించిన మీదట; అమ్మాయి మొగుడు అలగామనిషి, తాగుబోతు, జైలుపక్షి మొదలైనవి కాదనీ, మంచి సంబంధమేననీ, చాలా మంచి సంబంధం కూడా ననీ, అతనికి ఏ వంకా లేదనీ, పైగా అబ్బాయి స్నేహితుడేననీ, అతనికి ఐదారువేల కట్నంతో పిల్లనిస్తానని కూడా వచ్చారనీ, ఉద్యోగం చేసుకుంటూ నెలనెలా మూడొందలు తెచ్చుకుంటున్నాడనీ - ఒక్కొక్క సంగతే బైట పడింది.

తాను యెందుకు అరిచి గావుకేకలు పెట్టిందీ నాన్నకు అర్థం కాలేదు. అమ్మకు మాత్రం తాను శోకం పెట్టటం చాలా ఉచితంగానే ఉందనిపించింది.

చాటుగా అయిన పెళ్ళి అన్న సంగతి కప్పి పెట్టటానికి ముహూర్తం చూసి మళ్ళీ పెళ్ళి జరిపించారు.

అమ్మనూ, నాన్ననూ అందరూ ప్రశంసించారు. కాని అసలు పెళ్ళి తిరపతిలో పెద్దలెవరూ లేకుండా జరిగిపోయినట్టు పొక్కనే పొక్కింది.

"అమ్మాయి మీకు తెలీకుండా పెళ్ళి చేసుకుందిటగా!" అని కొందరు అమ్మను అడగనే అడిగారు.

"ఇంకా నయం, ఈ సంబంధం మేం మొదటినుంచీ అనుకున్నదే. అల్లుడికి తిరపతిలో పెళ్ళి మొక్కుందిట. మేం వెళ్ళాలంటే పడక అబ్బాయిని అమ్మాయి వెంట పంపించాం" అన్నది అమ్మ.

నాన్నగూడా నలుగురితోనూ ఇంచుమించు ఈ విధంగానే చెప్పాడు. ఒక్క సీతప్ప మాఁవయ్య మటుకు అడ్డమైన వాళ్ళతోనూ, "వాళ్ళు ఎవరికీ తెలీకుండా పెళ్ళి చేసుకుని వచ్చేసరికి నేనూ అక్కడే ఉంటినిగా, పెళ్ళయిందని తెలిసేసరికి మేఁవంతా కొయ్య బొమ్మల్లా అయిపోయాఁవనుకో. బావ అరుపులూ, మా చెల్లెలు శోకాలూనూ. నే కోప్పడ్డాక గదూ వాళ్ళు సమాధానపడతా...." అని చెప్పేసి తాను అందరికన్నా పెద్ద పెళ్ళి పెద్ద అయిపోయాడు.

*ముద్రణ: నవగ్రహకూటం, కథల సంపుటి, 1966-68 మధ్య?*
*జనతా ప్రచురణాలయం, విజయవాడ*